క్లుప్తంగా

'మన్ కీ బాత్' వీక్షించిన నాయకులు



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ శ్రేణులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ 103వ మన్‌కీ బాత్ లైవ్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా నాయకులతో కలిసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ వీక్షించారు. సర్‌సిల్క్‌లోని తన నివాసంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు కార్యకర్తలతో కలిసి వీక్షించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల శ్రీ అభయాంజనేయ, శ్రీ సిద్ధి వినాయక ఆలయాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ –డాక్టర్ అనిత దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అభయాంజనేయ, శ్రీ సిద్ధి వినాయక ఆలయాల పూజారి రజత్ పాండేకు ప్రసాద సామగ్రితో పాటు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేశారు. జిల్లా కోశాధికారి అరుణ్, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్ఐ ప్రమీల

వాంకిడి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన దుర్గం యశోద ఇంటి గోడలు కూలిపోయాయి. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి గ్రామంలో పర్యటించిన సందర్భంగా తహసీల్దార్‌తో మాట్లాడి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలన్నారు. దీంతో అధికారులు ఆర్ఐ ప్రమీల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సెండె రాజ్‌కుమార్, సీపీఎం నాయకులు కార్తిక్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ప్రకాశ్

కెరమెరి: రెండు రోజుల్లో మన ఊరు –మన బడి పనులు పూర్తి చేయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండాలని గుత్తేదారుకు సూచించారు. ఆయన వెంట హెచ్‌ఎం భాస్కర్, ఉపసర్పంచ్ నిసార్ దేశ్‌ముఖ్, గుత్తేదారు తిరుపతి ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : బ్రో

కాగజ్‌నగర్

వెంకటరమణ : బ్రో

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.140
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	80
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	100
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్



పంటలకు వరద పోటు

- సుమారు 500 ఎకరాల్లో పంట నష్టం
- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- ఉప్పొంగిన పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగు, ప్రాణహిత
- ఆందోళనలో అన్నదాతలు

పెంచికల్‌పేట్: భారీగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మండలంతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రాణహిత నది, పెద్దవాగు, ఉచ్చమల్లవాగు, బొక్కివాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని వాగు పరీవాహక ప్రాంతంలో సుమారు 500 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు అన్నదాతలు పేర్కొంటున్నారు.

ముంచుతున్న వరదలు..

ఏటా వానాకాలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలు వరదల్లో నీటమునుగుతుండడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన బొంబాయిగూడ, ఎల్కపల్లి, పెంచికల్‌పేట్, ఎల్లూర్, అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లో సాగు చేస్తున్న సుమారు 350 ఎకరాల్లో పంటలు కొట్టుకుపోయాయి. మరోవైపు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత ఉప్పొంగడంతో మురళీగూడ, జిల్లెడ గ్రామాల్లోని సుమారు 150 ఎకరాల్లో పత్తి పంటలు రెండు రోజులుగా నీటిలోనే మునిగి ఉన్నాయి. గత పదిరోజుల్లో రెండు సార్లు పంటలను వరదలు ముంచెత్తడంతో నష్టం తప్పదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది సైతం..

గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షాలకు మండలంలో సుమారు 2500 ఎకరాల్లో పంటలు పూర్తిగా కొట్టుకుపోయి పంట చేలలో ఇసుక మేటలు వేశాయి. అధికారులు నష్టపరిహారం కోసం సర్వే చేసి నివేదికలు పంపించినా ఇప్పటికీ పరిహారం మంజూరు కాలేదు. ఏటా వరదలతో పంటలు నష్టపోతున్నా పట్టించుకునే వారే లేరని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఏటా నష్టాలే..



పెద్దవాగు, ప్రాణహిత నదులు ఉప్పొంగడంతో ఏటా పంటలు నీటమునుగుతున్నాయి. వరదలతో రెండు, మూడు రోజులు పంటలు నీటిలోనే మునిగి ఉండటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఏటా అధికారులు సర్వే చేసినా పంట నష్టపరిహారం మాత్రం అందడం లేదు.

– జయరాం, రైతు, కమ్మర్‌గాం

గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నతంగా చదవాలి



సన్మానిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్, నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్, ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో ఆదివారం స్థానిక బుద్ధ విహార్‌లో విద్యార్థులను మహార్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్, జేఈఈలో దుర్గం తేజ, జాడి నితిన్, చునార్కర్ ఉర్నితలు సీటు సాధించడం అభినందనీయమన్నారు. బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షుడు దాగం పత్రు, గౌరవాధ్యక్షుడు దుర్గం జీవన్‌దాస్, కమిటీ సభ్యులు బసర్కార్ అశోక్, దుర్గం జానకీరావ్, శంకర్, కిశోర్, దాగం ఆగయ్య, మోరేశ్వర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలకు సన్మానం



కెరమెరి: ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

కెరమెరి: మండల కేంద్రంలో ఇటీవల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గుంపుల విజయ్ కుమార్‌ను సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్, నాయకుడు శివాజీ శాలువాతో సత్కరించారు. ఏఎస్సై బాల్ సింగ్ ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: కౌటాల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.మధుకర్‌ను ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో మండల బౌద్ధ సమాజ్ సంఘం ఆధ్వర్యంలో నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. సంఘం మండలాధ్యక్షుడు బండు రావు, ఉపాధ్యక్షుడు గోమాజీ, నాయకులు గోవింద్ రావు, గజానాన్, ఆగయ్య, పత్రు, తదితరులు ఉన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో ఆగస్టు 6న నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ కోరారు. ఆదివారం పట్టణంలోని విద్యాధరి పాఠశాలలో జిల్లాస్థాయి స్కీం వర్కర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కరువైందన్నారు. పద్మ, స్వరూప, అర్చన, మాన్కుబాయి, సరోజ, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: ట్రాన్స్‌కోకు సంబంధించిన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ 132 కేవీ సబ్‌స్టేషన్, టవర్‌లైన్‌లో మరమ్మతుల కారణంగా నేడు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు ఆసిఫాబాద్ పట్టణం, వాంకిడి, కెరమెరి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాకపోకలకు ఇబ్బందులు



అప్పపల్లి రోడ్డుపై ఏర్పడిన గుంత

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అప్పపల్లి, తుంపెల్లి, సాలేగూడ, హిరాపూర్, బడిబండతో పాటు పలు గ్రామాల్లో వాగులు, ఒర్రెలపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు పైపులు భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడడంతో రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ

- వ్యాధుల నివారణ దిశగా చర్యలు
- చొరవ చూపుతున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు
- మండలంలో 31 గ్రామ పంచాయతీలు



నిల్వ ఉన్న నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలో గత కొన్నిరోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో వ్యాధులు సోకే ప్రమాదముందని గ్రహించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టారు. పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ రోజువారి కూలీలతో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు.


ప్రతీ రెండు రోజులకోసారి..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం జనాభా 33 వేలు ఉండగా, ఓటర్లు 18,970 మంది ఉన్నారు. ఆయా గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. ప్రతీ రెండు రోజులకోసారి మురికి నాలాలు శుభ్రం చేస్తున్నారు. ఎక్కడా మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బుషేస్ కటింగ్, పెంటకుప్పల తొలగింపు, ప్రధాన రోడ్ల కిరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చూడడం, రోజూ ఉదయం ట్రాక్టర్ ద్వారా నిల్వ ఉన్న చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలు గ్రామాల్లో చేపడుతున్నారు. మురికి నీటిలో టెమిఫాస్ ద్రావణం వేస్తున్నారు.

రోజువారి కార్యక్రమాలు..

ఇప్పటికీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రోజువారి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, మురికి నీరు లేకుండా చేయడం, పాత టైర్లలో, డబ్బాల్లో, డ్రమ్ముల్లో మురికి నీటిని పారబోయడం, పాడుబడిన భవనాలను కూల్చడం వంటి పనులు నిత్యం చేపడుతున్నారు. దీంతోపాటు వ్యాధుల నివారణ కోసం గ్రామీణులకు రోగాలపై అవగాహన కల్పిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు మండలంలో ఇప్పటివరకు మొత్తం 250 బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు, 76 బ్యాగుల సున్నం, 45 థెమోపాస్ బ్యాగులు, బైలార్వా 45 ప్యాకెట్లు పంపిణీ చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వానాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించాం. ఎక్కడా కూడా చెత్త చెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతపై దృష్టి సారించాం.

- మహేందర్, ఎంపీడీవో

మురళీగూడలో కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అసాంఘిక శక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయం కల్పించొద్దన్నారు. యువత చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట పెంచికల్‌పేట్, దహెగాం ఎస్సైలు కొమురయ్య, సనత్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



దెబ్బతిన్న పంటలు పరిశీలిస్తున్న బాలకృష్ణ

బెజ్జూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నాగపెల్లి, మొగవెల్లి, పాతసోమిని, కొత్త సోమిని, తలాయి, తిక్కపల్లి, భీమవరం, పాపన్నపేట్, ఇప్పలగూడ ప్రాణహిత నది పరీవాహక ప్రాంతాలను, వరదల కారణంగా నష్టపోయిన పత్తి పంట చేలను పరిశీలించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మాజీ వైస్‌ఎంపీపీ రామయ్య, సంజీవ్, మాజీ సర్పంచ్ వసుల్లా ఖాన్, బిక్షపతి, శ్యాంసుందర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి



జక్కుల పెల్లిలో పరిసరాలు పరిశీలిస్తున్న రవీందర్

రెబ్బెన: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రవీందర్ అన్నారు. మండలంలోని నంబాల, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపెల్లి, కొమురవెల్లి గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉన్న శానిటేషన్ మెటీరియల్స్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలన్నారు. మురికి కాలువలు శుభ్రం చేసి నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఆయిల్ బాల్స్ ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. డ్రై డేను పకడ్బందీగా అమలు చేయాలని, మంచినీటి బావులు, నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టాలన్నారు. జీపీ కార్మికుల సమ్మెతో ఎక్కడా పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక కార్మికులను నియమించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా ఆయా పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను క్రమబద్ధీకరించాలి



డీపీవోకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

కౌటాల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి సురేందర్‌కు కార్మికులు వినతిపత్రం అందించారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 25వ రోజు కొనసాగింది. సమ్మెలో కార్మికులు మోరేశ్వర్, నాగేశ్, ప్రకాశ్, బానీత్, రవి, రాజారం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?



తిర్యాణి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని రొంపెల్లి నుంచి గుండాల గ్రామం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు బురదతో పాటు బండ రాళ్లతో నిండి ఉంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నత చదువుకు ఎమ్మెల్యే భరోసా



ఎమ్మెల్యేతో విద్యార్థి, కుటుంబసభ్యులు

నార్నూర్: మండలంలోని భవానిగూడ గ్రామానికి చెందిన కుర్సెంగా ఈశ్వర్ జార్ఖండ్ రాష్ట్రం జంషెడ్‌పూర్ నీట్‌లో సీటు రాగా, ఆదివారం విద్యార్థి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును క్యాంపు కార్యాలయంలో కలిశారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి కావడంతో ఈశ్వర్ ఉన్నత చదువులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సర్పంచ్ ఆత్రం జాలీంషా, బీఆర్ఎస్ నాయకులు మెస్రం అంబాజీ, దీపక్ ముండే, మెస్రం దౌలత్‌రావు, పెందూర్ లాల్‌షావ్ తదితరులు ఉన్నారు.

గురుకులంలో 'కళ్లకలక'

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులంలో వారంరోజులుగా విద్యార్థులు కళ్లకలకతో ఇబ్బందులు పడుతున్నారు. మొదట ముగ్గురు, నలుగురికి కళ్లకలక రావడం, వారిని ముందుజాగ్రత్తగా ప్రత్యేక గదుల్లో ఉంచకపోవడంతో అది కాస్త వ్యాపించడంతో సుమారు 400మంది కళ్లకలకతో బాధపడగా స్థానిక ఆస్పత్రి వైద్యాధికారి అనిల్‌రావు నేతృత్వంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు కోలుకుంటున్నారు. ఇంకా కొంతమంది విద్యార్థులు కళ్లకలకతో బాధపడుతుండగా, వారిని ప్రత్యేక గదుల్లో ఉంచారు. కళ్లకలక వచ్చిన వారికి కళ్లు ఎరుపుగా మారి, రాత్రులు సైతం నిద్రపట్టకా, అవస్థలు పడుతున్నట్లుగా విద్యార్థులు వాపోతున్నారు. పిల్లలను చూడటానికి వారి తల్లిదండ్రులు ఆదివారం వసతి గృహం వద్ద బారులు తీరారు. కాగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న బాలభాస్కర్ భారీ వర్షాల దష్ట్యా హెడ్‌క్వార్టర్లలోనే ఉండాల్సి ఉన్నప్పటికీ ఆయన సెలవులపై వెళ్లడం, పిల్లలు అనారోగ్యం భారినపడటంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా వసతి గృహంలో హెచ్‌ఎస్‌ను నియమించాలని కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌రూరల్: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు మౌనిక అన్నారు. ఆదివారం లిమ్‌గూడకు వాగు దాటి వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధులపై అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు.